వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణం

కడ్తాల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

కడ్తాల మండలకేంద్రంలో శ్రీశ్రీశ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాదాయ ధర్మాదాయశాఖ తరపున వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీశ్రీశ్రీ బూనీలసమేత లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణం అంగరంగవైభవంగా జరిగింది. అర్చకులు, మేల్కొరి వెంకటేశ్వరశర్మ, అర్చకులు అయ్యగారి వెంకటేష్, శ్రీధర్‌పంతులు, శ్రీనరసింహమూర్తి, శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పాలాది ఆంజనేయులు,కల్వకుర్తి మాజీఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్‌విండోచైర్మన్ గంపవెంకటేష్‌గుప్తా, మార్కెట్‌కమిటీచైర్మన్ యాటగీతానరసింహ, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గూడూరుభాస్కర్‌రెడ్డి, టాస్క్ సిఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీజెడ్పిటిసి లంబాడిహక్కుల పోరాటసమితి రాష్ట్రఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్, టిపిసిసిసభ్యులు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, కడ్తాల్ మండలపరిషత్ మాజీఉపాధ్యక్షుడు బి.ఆనంద్, రైతుసమన్వయసమితి జిల్లాసభ్యుడు బాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీఉపసర్పంచ్ రామకృష్ణ, మాజీఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు.

గంజాయి విక్రేత రిమాండ్..85 గ్రాములు సీజ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

గంజాయి తాగడంతోపాటు ఇతరులకు అమ్మిన ఓవ్యక్తిని అరెస్ట్‌చేసి 85గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్ చిన్నచెరువు వద్ద ఓవ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఘట్‌కేసర్ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా గుంటిగూడెంకు చెందిన బైక్‌మెకానిక్ చింత శివకుమార్(24) అని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా గంజాయికి అలవాటుపడి దూలిపేట్‌కువెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలుచేసి దాని న్ చిన్నచెరువుకట్టపై చెట్లపొదల్లో రాళ్లకింద దాచిపెడుతుండేవాడని తెలిపారు. అవసరం ఉన్నప్పుడు తీసి తాగడం, కావాలన్నవారికి గంజాయిని అమ్మడం చేస్తున్నాడని విచారణలో ఒప్పుకున్నాడు. పోలీసులు వెళ్లి పరిశీలించగా చెట్టు రాళ్లకింద దాచిన కవర్లనుంచి గంజాయిని తీసిచూపించడంతో దాదాపు 85గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్‌చేసి నిందితుడు శివకుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ఇళ్లకు తాళాలువేసి నిరసనదీక్షకు వెళ్లిన రోటిబండ తండావాసులు

రైతు నిరసనదీక్షకు బయలుదేరుతున్న రోటిబండ తండావాసులు

దుద్యాల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణకేంద్రంలో బిఆర్ఎస్‌పార్టీ నిర్వహించిన రైతు నిరసనదీక్షకు గ్రామంలోని రైతులందరు బయల్దేరివెళ్ళారు. గ్రామంలోని అన్ని ఇండ్లకు తాళాలువేసి బయలుదేరిన వెళ్ళడంతో గ్రామంలో నిశ్శబ్ద వాతావరణం సంతరించుకుంది. మండలపరిధిలోని రోటిబండ తండావాసులందరు బిఆర్ఎస్ చేపట్టిన నిరసనదీక్షకు వెళ్ళడంతో బిఆర్ఎస్‌పార్టీపై తండావాసులు అభిమానంపెంచుకున్నారని పలువురు పేర్కొంటున్నారు. పారిశ్రామికవాడ ఏర్పాట్లలోభాగంగా భూములు కోల్పోతున్న గ్రామాల్లో ఇది ఒక గ్రామమే. గ్రామానికిచెందిన మహిళలు, పురుషులు, చిన్న, పెద్దలు అందరూ కెటిఆర్ సభకు వెళ్లడం విశేషం. గతంలో ఈతండా మొత్తం కాంగ్రెస్‌పార్టీ వైపు ఉన్నట్లు సమాచారం. లగచర్లఘటన తర్వాత గిరిజనులు జైలుపాలు అయితే వారికి బిఆర్ఎస్‌పార్టీ నాయకులు అండగానిలిచిన విషయం తెలిసిందే. తండావాసులకు అండగానిలబడిన పార్టీ కావున వారుకూడా అండగానిలబడాలనే ఉద్దేశంతో అభిప్రాయాలను పూర్తిగా మార్చుకుని బిఆర్ఎస్ పార్టీకి రైతు నిరసనదీక్షకు బయలుదేరి రుణం తీర్చుకున్నారు. రోటిబండ తండాతోపాటు పులిచర్లకుంట తండా, హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల రైతులు పెద్దమొత్తంలో రైతు నిరసన సభకు తరలి వెళ్లారు.

కెటిఆర్‌ను కలుసుకున్న బిఆర్ఎస్ నేతలు

కెటిఆర్‌ను కలుసుకున్న బిఆర్ఎస్ నేతలు

ఆమనగల్లు, ఫిబ్రవరి10, ప్రభాతవార్త:

బిఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే కెటిఆర్‌ను సోమవారం ఆమనగల్లు బిఆర్ఎస్ నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కల్వకుర్తి మాజీ శాసనసభ్యుడు, తాలూకా ఇంచార్జీ గుర్కా జైపాల్‌యాదవ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ల సమక్షంలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, యువజన విభాగం నేతలు దేరంగుల వెంకటేశ్, వడ్డె గణేశ్‌లు కలుసుకున్నారు. కెటిఆర్‌ను కలుసుకోవడం మాలో ఆత్మవిశ్వాసాన్ని మరింత రెట్టింపుచేసిందని వీరు సంతోషం వ్యక్తంచేశారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో వ్యూహాత్మక ధోరణిని అవలంబించాలని, రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వాటిని ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. ఎన్నికలనాటికి ప్రజల్లో ఉండిపోవాలని సూచించినట్లు వారు తెలిపారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించి తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని ప్రజలకు చేరువ చేయాలని కెటిఆర్ సూచించినట్లు పత్యనాయక్ తెలిపారు.

మంద కృష్ణమాదిగను కలిసిన మండల నాయకులు

మంద కృష్ణమాదిగను కలిసిన మండల నాయకులు

నవాబుపేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను సోమవారం ఎమ్మార్పిఎస్ మండలనాయకులు కలిశారు. మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించినందుకు, వర్గీకరణ సాధించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లక్షడప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమం ప్రభుత్వ అనుమతి విషయంలో వాయిదాపడిందని వారు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేదిశగా చర్యలు చేపట్టి చట్టబద్ధత కల్పించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్‌నాయకులు చంద్రశేఖర్‌మాదిగ, జాన్‌మాదిగ, పరమానందంమాదిగ, రాంచంద్రయ్యమాదిగ, రత్నంమాదిగ, రవిమాదిగ, కృష్ణమాదిగ, ప్రకాశ్ మాదిగ, గోపాల్‌మాదిగ, వెంకటేశ్‌మాదిగ, రాజుమాదిగ, అంజయ్య మాదిగ, నర్సింలుమాదిగ, సాయిలుమాదిగ పాల్గొన్నారు.

పరిగి మండలంలో 11 ఎంపిటిసి స్థానాలు

పరిగి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

వికారాబాద్ జిల్లా పరిగి మండలంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, మండల పరిషత్ కార్యాలయం నుండి పరిగి మండలంలో 11 ఎంపిటిసి స్థానాలను ప్రకటిస్తూ ఎంపిడిఓ కరీం వివరాలు వెల్లడించారు. బర్కత్‌పల్లి, మాదారం,మిట్టకోడూర్,చిట్యాల, గడిసింగాపూర్, కడ్లాపూర్, రూప్‌ఖాన్‌పెట్, రాపోల్, సయ్యద్‌పల్లి, నారాయణపూర్, రంగంపల్లి గ్రామాలను ఎంపిటిసి స్థానాలుగా ప్రకటిస్తూ, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితాను విడుదల చేశారు. మండలంలో పురుషులు 15534, స్త్రీలు 15667మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించిన భూదాన్ బాధితులు

నందిగామ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

నందిగామ తహసిల్దార్‌కార్యాలయంలో రెవిన్యూపరిధిలోని భూదాన్‌భూములు రిజిస్ట్రేషన్ కాకుండా నిషేధించాలని సోమవారం నందిగామ మండలకేంద్రానికి చెందిన భూదాన్‌బాధితులు జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 1975లో 18మంది నిరుపేదలకు గ్రామసభ తీర్మానంచేసి భూదాన్ ఉత్తర్వులు లేఖ నెం.6346/1975 ప్రకారం భూదాన్ ప్రొసీడింగ్ ఇచ్చినట్లు కలెక్టర్‌కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అల్వాల వెంకటయ్య, కావలి శ్రీను, రామయ్య, శివ్వగళ్ళ పోచయ్య, చంద్రయ్య, బొంగుపల్లి జంగయ్య, యాదయ్య, తుప్పుడు పోచమ్మ, నరసింహ, అంజయ్య, మల్లేష్, అడివయ్యలు కలెక్టర్‌ను కలిశారు.

అంతాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదం..నిరసనలు చేస్తున్న గ్రామవాసులు

-జిల్లా కలెక్టరేట్ వద్ద సైతం ఆందోళన వ్యక్తం చేసిన గ్రామవాసులు
-అంతాయిపల్లి బాధితులను ఆదుకోవాలి
-రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
-కలెక్టర్ స్పందించాలి..న్యాయం చేయాలంటూ డిమాండ్

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద అంతాయిపల్లి గ్రామవాసులు ఆందోళన వ్యక్తం చేసిన దృశ్యం

శామీర్‌పేట (మేడ్చల్‌జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

కలెక్టరేట్ ఏర్పాటులో భూములుకోల్పోయిన అంతాయిపల్లి గ్రామ బాధితులను ఆదుకోవాలని, అదేవిధంగా అంతాయిపల్లి (బిట్స్-కలెక్టరేట్)చౌరస్తా రోడ్డుప్రమాదాల నివారణకు తగుచర్యలు తీసుకోవాలని అంతాయిపల్లి గ్రామస్థులు, పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌వద్ద శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని అంతాయిపల్లి గ్రామస్థులు, పలువురు నాయకులు పాల్గొని అంతాయిపల్లి వాసులకు న్యాయం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. అయితే అంతాయిపల్లి చౌరస్తా(బిట్స్-కలెక్టరేట్‌కు వెళ్లే)వద్ద ఉదయం వాహనాల అతివేగంతో రోడ్డుప్రమాదం జరగటం, ఇద్దరు మహిళలు గాయత్రి, భవానీలకు తీవ్రగాయాలు కావటం, వెంటనే ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించటం జరిగింది. ఆ తరువాత అంతాయిపల్లి వాసులు సుమారు రెండు గంటల పాటు చౌరస్తా వద్ద రాస్తారోకో చేసి బైఠాయించి నిరసనలు తెలిపి బాధితులకు న్యాయం చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ఆందోళన వ్యక్తంచేశారు. ఆతరువాత జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని అంతాయిపల్లి వాసులకు న్యాయం చేయాలంటూ ఆందోళన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా తూంకుంట మున్సిపాల్టీ, అంతాయిపల్లి నాయకులు ఎన్. రవీందర్‌గౌడ్, అనిల్‌రెడ్డి, మహేందర్, ఎల్లప్ప మరి కొందరు మాట్లాడుతూ అంతాయిపల్లి రెవెన్యూ పరిధిలో జిల్లా కలెక్టరేట్ రావటంతో భూములు కోల్పోయామని, అదేవిధంగా రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు కూడా కోల్పోయే పరిస్థితులు దాపురించాయని వారు అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే అంతాయిపల్లి వాసుల గోడును పట్టించుకోవాలని, భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలని, అదేవిధంగా కలెక్టరేట్ ఉండటం వల్ల వాహనాల రద్దీ పెరిగిందని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వెంటనే బిట్స్-కలెక్టరేట్‌కు వచ్చే చౌరస్తావద్ద స్పీడ్‌బ్రేకర్స్ ఏర్పాటుచేయాలని, వీధిదీపాలు(స్ట్రీట్ లైట్స్) రోడ్డువెంట ఏర్పాటు చేయాలని, ఆర్టీసి బస్సుల సౌకర్యం కల్పించాలని అంతాయిపల్లి గ్రామవాసులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అంతాయిపల్లిలోనే కలెక్టరేట్ ఉంటుంది. కాని ఈ గ్రామప్రజల సమస్యలు పరిష్కారం కావటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి అంతాయిపల్లి వాసుల సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు, మహిళలు, బాధితులు కోరారు. ఈకార్యక్రమంలో అంతాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను పరిష్కరించాలి

-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
-జిల్లా వ్యాప్తంగ ప్రజావాణిలో అందిన 57దరఖాస్తులు

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మేడ్చల్‌జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను, వినతులను, ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని మేడ్చల్‌జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా 57ఫిర్యాదులు ప్రజల నుంచి అందినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లాఅదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధశాఖల్లో ఉన్న ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం చేయాలని, ప్రజల కోసమే ప్రజావాణి నిర్వహించటం జరుగుతుందని, అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఆన్‌లైన్‌లో పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికపుడు పరిశీలనజరుపుతూ సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా లా-ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశము హాలునందు ఏర్పాటు చేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు 176 ఫిర్యాదులు సమర్పించారని అన్నారు. వాటిలో ధరణికి సంబంధించిన భూసమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూసర్వే ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మండలాలకు సంబంధించిన పలుగ్రామాల ప్రజలు ఇచ్చిన భూసమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. ఆన్లైన్ రికార్డు చెక్‌చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలనీ ఆదేశించారు. భూసమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. ఈసమావేశంలో ఏవో పర్వీన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడ రైతులను పరామర్శించిన కెటిఆర్

-అందరికీ అండగా ఉంటామని భరోసా
-జ్యోతి, ప్రవీణ్‌ల బిడ్డకు పేరుపెట్టి ఆశీర్వదించిన కెటిఆర్

హకీంపేట్ చౌరస్తాలో కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న కెటిఆర్

దుద్యాల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

పారిశ్రామికవాడ బాధిత రైతులను బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సోమవారం పరామర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిపట్టణంలో నిర్వహించిన రైతుసదస్సుకు హకీంపేట్ గ్రామంమీదుగా వెళుతున్న క్రమంలో రైతులు బిఆర్ఎస్ నాయకులు గ్రామశివారునుండి ప్రధానచౌరస్తావరకు ర్యాలీచేపట్టి స్వాగతం పలికారు. కెటిఆర్ బాధిత రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. లగచర్ల ఘటన చోటు చేసుకున్నప్పుడు తనభర్త ప్రవీణ్‌ను పోలీసులు లాక్కెల్లారని ఎస్సీ, ఎస్టీ, జాతీయకమిషన్‌ను ఆశ్రయించిన జ్యోతికి కూతురుపుట్టింది. దీంతో జ్యోతి, ప్రవీణ్‌ల దంపతులకు పుట్టినబిడ్డకు కెటిఆర్ "భూమి" అని పేరు పెట్టారు. ఆయనతోపాటు మాజీమంత్రులు సత్యవతిరాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీఎంపి మాలోత్‌కవిత చిన్నారిని ముద్దాడారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ, మాభూములు ఎలాగైనా కోల్పోకుండా చూడాలని బిఆర్ఎస్‌నాయకులను వేడుకున్నారు. అక్కడినుండి నేరుగా కోస్గి రైతుర్యాలీ, సభకు వెళ్లారు. ఆయనవెంట కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు చాంద్‌పాషా, యాదగిరి, విష్ణు వర్ధన్‌రెడ్డి, బాబర్, మహేందర్‌రెడ్డి, యాదయ్య, మడిగే శ్రీనివాస్, నరేష్ గౌడ్, శ్యాసం వెంకటయ్య, బసిరెడ్డి, అజ్మీర్, బసప్పమండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రూ.4250 కోట్లతో తాండూరు మీదుగా ఆరు లైన్ల రోడ్డు

-తాండూరు-హైదరాబాద్ రోడ్డుకు కొత్త టెండర్లు
-తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

మజీద్‌ను ప్రారంభిస్తున్న శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

తాండూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

రాష్ట్రంలోని వికారాబాద్‌జిల్లా మన్నెగూడనుండి తాండూరుమీదుగా కర్ణాటకరాష్ట్ర బీదర్‌వరకు రూ.4250కోట్ల నిధులతో ఆరులైన్ల రోడ్డు రాబోతుందని తెలంగాణరాష్ట్ర శాసనసభస్పీకర్ గడ్డంప్రసాద్‌కుమార్ తెలిపారు. సోమవారం తాండూరులో వ్యాపారి ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో సయ్యిదునాఅలీ మజీద్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..త్వరలో వికారాబాద్‌జిల్లాకు కొత్తకళ రాబోతుందన్నారు. మన్నెగూడనుండి తాండూరుమీదుగా కర్ణాటకరాష్ట్ర బీదర్‌వరకు రూ.4250కోట్ల నిధులతో ఆరులైన్ల రోడ్డు మంజూరు కాబోతుందని తెలిపారు. చేవెళ్ల బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి జిల్లాలో ఆరులైన్ల రోడ్డునిర్మాణానికి ప్రతిపాదనలు అందించడం జరిగిందని వివరించారు. జిల్లామీదుగా కర్ణాటకవరకు భారీరోడ్డు నిర్మాణం జరిగితే ఇరురాష్ట్రాల మధ్య సత్సంబంధాలు బలపడుతాయని అన్నారు. అదేవిధంగా ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న తాండూరు-హైదరాబాద్ రోడ్డునిర్మాణానికి పాతటెండర్లు రద్దుచేసి కొత్తటెండర్లు వేయడం జరిగిందని, త్వరలో రోడ్డు నిర్మాణపనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మరో ఆరునెలలలోపు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు.

అగ్గి పుడితే...బుగ్గిపాలే

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆమనగల్లు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాలమండలాలు అగ్నిమాపకకేంద్రం లేక తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. దురదృష్టవశాత్తు అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే వాటిని ఆర్పివేయడానికి దగ్గరలో అగ్నిమాపకకేంద్రం అందుబాటులో లేకపోవడమే కారణమంటున్నారు. కల్వకుర్తి నియోజకవర్గకేంద్రంలో అగ్నిమాపకకేంద్రం ఉన్నా నాలుగుమండలాల గ్రామాలకు సరాసరి 50కిమీ పైన దూరాన్ని చూపిస్తుంది. దీంతో అగ్గిపుడితే ఆస్తి పూర్తిగా బుగ్గిపాలు కావలసిందేనన్న భావన తీవ్రంగా వేధిస్తున్నది. కల్వకుర్తినుండి నాల్గుమండలాలకు చేరుకునేసమయానికి అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోవలసి వస్తుందంటున్నారు. కాగా ఫిబ్రవరి9 ఆదివారంరాత్రి ఆమనగల్లుపట్టణం శివాలయం కాలనీలోని కండె వెంకటయ్య పాత మిని రైస్‌మిల్లులో అనుకోకుండా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటలు ఎగిసిపడి భయకంపితులను చేసింది. అగ్నిమాపకకేంద్రానికిసమాచారం అందించినా సకాలంలో చేరుకోకపోయేసరికి చుట్టుప్రక్కల ప్రాంతాలవారే తీవ్రంగా శ్రమించవలసివచ్చింది. అగ్నిమాపక వాహనం చేరుకునేసమాయానికి మంటలు ఎగిసిపడుతూ ఆందోళనకు గురిచేశాయి. వినియోగంలోలేని మిల్లుకాబట్టి ఎవ్వరికీ నష్టం వాటిల్లలేదు. కానీ దానికి భిన్నమైనవాటిలో అగ్నిప్రమాదం జరిగితే నష్టతీవ్రత పెద్దగా ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా పాతమిల్లులో జరిగిన అగ్నిప్రమాదంతో చుట్టుప్రక్కల నివసిస్తున్నప్రజలు తీవ్రభయాందోళనలకు గురయ్యారు.గతంలో ఆమనగల్లుపట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలంప్రధానరహదారిపైగల ఎల్‌వీఆర్ క్లాత్ మర్చంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం విషయం ఫైర్ స్టేషన్‌కు తెలిపినా, సమయానికిరాకపోయేసరికి ప్రమాదతీవ్రతపెరిగి దుకాణం పూర్తిగా తగలబడిపోయింది. దీంతో బాధితుడికి కోట్లనష్టం వాటిల్లింది. అగ్నిప్రమాదాలు పట్టణాలకేకాకుండా మారుమూలగ్రామాలకు పొంచి ఉంటుందంటున్నారు. కల్వకుర్తికిసమీపంలో ఉన్న ఆమనగల్లులో ప్రమాదంజరిగితేనే సకాలంలో ఫైర్‌స్టేషన్‌సేవలు సమయానికి అందుకోవడంలేదు. మరి మారుమూల గ్రామాలతోపాటు కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లిమండలాల గ్రామాలపరిస్థితి ఏమిటో అర్థంచేసుకోవాలని ప్రజలు పాలకులకు విజ్ఞప్తిచేస్తున్నారు. పాలకులు పట్టించుకుని ఆమనగల్లు మండలకేంద్రంలో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటుచేస్తే భవిష్యత్తులో అగ్నిప్రమాదాలను అరికట్టే అవకాశాలు ఉన్నాయని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇద్దరు మహిళలపైకి దూసుకెళ్లిన వాహనం

శామీర్‌పేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:

అంతాయిపల్లి మెయిన్‌రోడ్డు బిట్స్‌చౌరస్తావద్ద బస్సుకోసం వేచి ఉన్న ఇద్దరు మహిళపైకి రెడిమిక్స్‌వాహనం దూసుకెళ్లటంతో తీవ్రగాయాలకుగురై హాస్పిటల్‌లో చికిత్సలుపొందుతున్నారు. సోమవారంఉదయం శామీర్‌పేటమండలం తూంకుంట మున్సిపాల్టీ అంతాయిపల్లి బిట్స్‌చౌరస్తావద్ద ఈసంఘటన జరిగింది. శామీర్‌పేటపోలీసుల కథనంప్రకారం అంతాయిపల్లి గ్రామానికి చెందిన కొరివి గాయత్రి(24), కొరివి భవాని(19) ఇద్దరూకలిసి తిరుమలగిరిలో పనిచేయటానికి వెళుతుండగా బిట్స్‌చౌరస్తా వెదురువనంవద్ద బస్సుకోసం వేచి ఉండగా కీసరవైపునుంచి అతివేగంగా వస్తున్న ఆర్ఎంసి (రెడిమిక్స్) వాహనం ఎదురుగావస్తున్న కారును తప్పించబోయి కారు కుడివైపున ఢీకొని ఎడమవైపు బస్సుకోసం వేచిచూస్తున్న కొరివి భవాని, కొరివి గాయత్రిలపైకి దూసుకెళ్లినట్లు తెలిపారు. ఈప్రమాదంలో వారిరువురికీ తీవ్రగాయాలు కావటంతో వెంటనే చికిత్సనిమిత్తం కొంపల్లిలోని శ్రీకర్‌హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇది ఇలా ఉండగా ఈరోడ్డుప్రమాద సంఘటనను తెలుసుకున్న స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తును చేరుకుని రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని ఆదుకోవాలని, అతివేగంగా వస్తున్న వాహనాల స్పీడ్‌ను నియంత్రించటానికి స్పీడ్‌బ్రేకర్స్ ఏర్పాటుచేయాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈచౌరస్తా ప్రమాదకరంగా మారిందని, నాలుగువైపులా స్పీడ్‌బ్రేకర్స్ నిర్మాణంచేపట్టాలని స్థానికులు డిమాండ్‌చేశారు. అధ

అనాథ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి
- ఎమ్మెల్యే శ్రీగణేష్

రెజిమెంటల్ బజార్‌లోని ఆశ్రయ్ హోం సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: అనాథ పిల్లలను హక్కున చేర్చుకొని విద్యాబోధన అందించడంతో పాటు తగిన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసిన ఆశ్రయ్ హోమ్ స్వచ్ఛంద సంస్థను కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అభినందించారు. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని హిల్ స్ట్రీట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొనసాగుతున్న ఆశ్రయ్ అనాథ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఆ సెంటర్‌లో నెలకొన్న సమస్యలు, విద్యార్థినీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనాథ పిల్లలకు ఉచితంగా ఆశ్రయ్ హోమ్ సంస్థ ఆధ్వర్యంలో వంద మంది బాలికలకు ఉచిత వసతి భోజనం కల్పిస్తున్నామని, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని నిర్వాహకురాలు గ్రేస్ మని ఎమ్మెల్యే దృష్టి కి తెచ్చారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రభుత్వం సహకరిస్తే హాస్టేజ్ హోం, బాలుర వసతి గృహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. హాస్టల్‌లో విద్యుత్, సోలార్ సిస్టమ్, అదనపు గదులకు కెటాయించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో ఫోన్‌లో మాట్లాడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్, ఆర్.డి.నాగేశ్ యాదవ్, రాంమోహన్, అరవింద్ యాదవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ అభివృద్ధికి పాటుపడాలి : కమాండర్ చక్రవర్తి

బోయిన్‌పల్లి సెయింట్ ఫీటర్స్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని తెలంగాణ తెలంగాణ ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ చక్రవర్తి, పాఠశాల పౌండర్ చైర్మన్ బాల్ రెడ్డిలు తెలిపారు. బోయిన్‌పల్లిలోని సెయింట్ ఫీటర్స్ హై స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ టీ.ఏ.రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సువర్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పట్టాలు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు పలువురిని అలరించాయి.

కార్పొరేటర్ మార్తా వాణి ప్రసాద్‌కు సత్కారం

కార్పొరేటర్ మార్తా వాణి ప్రసాద్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నిజాంపేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

లేక్ వ్యూ కాలనీవాసులు, అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్, మైత్రి లేక్ వ్యూ అపార్ట్మెంట్ సభ్యులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ మాజీ కార్పొరేటర్ మార్తా వాణి ప్రసాద్ సేవలకు గాను సోమవారం ఘన సన్మానం చేసి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్తా వాణి ప్రసాద్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను ప్రజలు తన దృష్టికి తీసుకురాగానే వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి ఎప్పటికప్పుడు ఆ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, మైత్రి అసోసియేషన్ సంజయ్, ఇండియా లింక్ వ్యూ ఫ్రెంట్ రేవతి, హరిబాబు, కాంగ్రెస్ పార్టీ లీడర్ మధుసూదన్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ లీడర్ జస్వంత్ పాల్గొనడం జరిగింది.

లంగర్ హౌస్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కారుకు బ్లాక్ ఫిలిం ను తొలగిస్తున్న ఇన్ స్పెక్టర్ అంజయ్య

మెహిదీపట్నం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :

ట్రాఫిక్ నియమ నిబంధనలను వాహనదారులు పాటించే విధంగా ట్రాఫిక్ పోలీసులు నిత్యం చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ట్రాఫిక్ పోలీసులు కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలింలను, సైరన్ లను హారన్ లుగా వాడుతున్న కార్లపై చర్యలు తీసుకుంటున్నారు. లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం లంగర్ హౌస్ బాపు ఘాట్ రింగ్ రోడ్డు ప్రాంతంలో కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలిం లతోపాటు హారన్ లను సైతం తొలగించారు. అనంతరం ఇన్ స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం స్పెషల్ డ్రైవ్ లను నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవడం తో పాటు వాహనదారులపై కేసులు కూడా నమోదు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని కోరారు.

ప్రజాఏక్తా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగరాజు



నాగరాజుకు బి.ఫాం అందజేస్తున్న జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త

బేగంబజార్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ఖమ్మం,నల్గొండ,వరంగల్ టిచర్ నియోజకవర్గం ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా బొడ్డు నాగరాజును ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త ప్రకటించారు.ఆదివారం గౌలిగూడపార్టీ కార్యాలయంలో బోడ్డునాగరాజుకు ఆ ఫార్టీ బిఫాంను నాగరాజును అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నియోకవర్గాలల్లో ఉన్న ఉపాధ్యాయులు ప్రజాఏక్తాపార్టీ ఉపాధ్యాయ అభ్యర్థిడికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై పార్టీలకతీతంగా ఫిర్యాదు..

నిజాంపేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

సర్వేనెంబర్ 233/21, నిజాంపేట్ కాలనీ శివాలయం పక్కనే ప్రభుత్వ భూమి 1100 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణం చేసుకున్న సంఘటనపై ఎమ్మార్వో సరైన విధంగా స్పందించకపోవడంతో సోమవారం పార్టీలకతీతంగా పలువురు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణం కూల్చివేసి కబ్జాదారుడుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నిజాంపేట్ మాజీ మేయర్ నీల గోపాల్ రెడ్డి, ఆకుల సతీష్, కాలనీ ప్రజలు, వివిధ పార్టీల సీనియర్ నాయకులతో కలిసి కలెక్టర్‌కు, అడిషనల్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది. అదే విధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ డంపింగ్ యార్డ్, ప్రగతి నగర్ డంపింగ్ యార్డ్ స్థలాలు, కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలకు

ఫిర్యాదు చేసిన ప్రజాప్రతినిధులు

అతీతంగా మాజీ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలసి కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది. అదే విధంగా ప్రజాప్రతినిధులు, నాయకులు కార్పొరేషన్ పరిధిలో భూ కబ్జాలకు గురి కాకుండా పార్టీలకతీతంగా ఆయా పార్టీల నాయకులు కలిసి ముందుకు రావాలని మాజీ మేయర్ తెలియజేశారు.

భారతీయ నృత్యాంశాలు సనాతన ధర్మానికి ప్రతీకలు

-మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: భారతీయ నృత్యాంశాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి పాలపర్తి సంధ్యారాణి, శ్రీ లాస్య నృత్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో భరత నాట్య నృత్య ప్రదర్శన సోమవారం నల్లకుంట శంకర మఠంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువకళా వాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి హాజరై అద్భుతమైన నృత్యప్రదర్శన చేసిన కళాకారులను సత్కరించి అభినందించారు. మారుతున్న కాలానుగుణంగా ఇటువంటి కళలలో శిక్షణ ఇవ్వడంతో పాటు ధైర్య సాహసాలు కూడా అత్యవసరమని, కళా ప్రదర్శనలలో సంస్కారం ఉట్టిపడుతుందని అందుకు సహకరిస్తున్న అందరికీ అభినందించారు. ప్రముఖ నాట్య గురువు విశాఖ ప్రకాష్ శిష్యురాళ్లు భరత నాట్యాంశాలను ప్రదర్శించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సభలో ప్రముఖ న్యాయవాది శ్రీమతి కలగా పార్వతి, బుర్ర మోహన కృష్ణ వ్యాఖ్యాతగా

నృత్యకళాకారులను సత్కరించిన దృశ్యం

వ్యవహరించారు. భరతనాట్యం కార్యక్రమంలో భాగంగా శ్లోకాంజలి ,గౌడ రాగం, మల్హరి, రాగాంశాలతో పాటుగా సరసవాణి, సరస్వతి, నటేష నవకం, దుర్గాదేవి, కళ్యాణి ,గీర్వాణి నక్షత్రమాలిక, గోవిందా హరి గోవిందా ,సంగీత సామ్రాజ్యం వంటి అంశాలను నయనానంద భరితంగా ప్రదర్శించారు. కళాకారులు దృహిత ,దుర్గ ,తాన్వి, హర్షిని, అక్షయ, సంకీర్తన, ప్రణవి ,మేధ, ఆద్య, అనఘ, మహతి ,శ్రియ, కార్తీక ,శ్రీహిత ,నయన ,రిధీమా,చక్కని హావాభావాలు ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు కన్వీనర్ రఘు శ్రీ సభ సమన్వయం గావించారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు..

ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

నిజాంపేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురనగర్ కాలనీలో అష్టలక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా నిజాంపేట్ గోకుల్ కన్స్ట్రక్షన్ ప్రోప్రైటర్లు మధుసూదన్ రెడ్డి, తిరుపాలయ్యలు రూ.51,000 అష్టలక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు జి. విష్ణువర్ధన్ రెడ్డి, పి.రాంబాబు, సిహెచ్ లింగ య్య, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ లకు అందజేశారు.

మరోదాత విరాళం..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురనగర్ కాలనీలో అష్టలక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మరో దాత ప్రగతినగర్ రుద్ర కన్స్ట్రక్షన్స్ పల్లెంపాటి నవీన్ రూ.1,00,000 తన వంతు సహాయంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నూతన కమిటీ సభ్యులు మార్కెట్ అభివృద్ధికి పాటుపడాలి : వేం నరేందర్ రెడ్డి

ప్రభుత్వ సలహాదారుడు వేమ్ నరేందర్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ దేవుడు, కమిటీ సభ్యులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: మార్కెట్ కమిటీ సభ్యులు రైతులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మార్కెట్ అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేమ్ నరేందర్ రెడ్డి సూచించారు. బోయిన్‌పల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కమిటీ నూతన చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు గౌడ్, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ (దేవుడు)లు, మార్కెట్ కమిటీ సభ్యులు సోమవారం వేమ్ నరేందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మార్కెట్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వెంకన్న, డైరెక్టర్లు ఎసంతోష్, రామన్, క్రిష్ణారెడ్డి, దుర్గేశ్ గౌడ్, ఆకాశ్ రెడ్డి, అంజద్ పాషా, రాజేందర్, అస్లమ్,గౌతమ్ ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధిపర్చేందుకే తన ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. సోమవారం 7వ వార్డులోని తిరుమలగిరి విలేజ్ వనితా సొసైటీ,సెయింట్ ఆంథోని చాపేల్,విరభద్రస్వామి దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగు,బోర్‌వెల్ వాటర్,రోడ్లు అస్థవ్యవస్థ ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చి నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మురళీ ముదిరాజ్,నాగినేని సరిత,రేమండ్ హర్‌హుడ్,భవానిసుందర్ రాజన్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా భవనాలు నిల్చిస్తే సహించేది లేదు : సిఈఓ

కంటోన్మెంట్,ఫిబ్రవరి 10ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఫ్లాట్ ఓనర్స్ భవనాలు, సొంత ఇండ్లు నిర్మించుకుంటే కంటోన్మెంట్ బోర్డు అనుమతులు తీసుకొని ఇండ్లు నిర్మించుకోవాలని ఫ్లాట్ ఓనర్స్ దళారులను నమ్మ వద్దని బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ సూచించారు. సోమవారం సిఖ్ విలేజ్, చండ్‌లాల్ బౌలి,ఎల్ఐసీ కాలనీలోని ఫ్లాట్ నెం 36 జిప్లెస్ 1 అనుమతి తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా అదనంగా మరో రెండు ఫ్లోర్లను నిర్మించాడు. విషయం తెలుసుకున్న బోర్డు అధికారులు రెండు సంవత్సరాల క్రితమే బోర్డు అధికారులు సీజ్ చేశారు. బిల్డర్ బోర్డు అదికారులు వేసిన సీజ్‌ను తొలగించి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. తిరిగి ఆ భవనాన్ని బోర్డు ఇంజనీర్లు సీజ్ చేశారు. త్వరలో ఆ బిల్డింగ్‌పై వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని సిఈఓ మధుకర్ నాయక్ తెలిపారు.

క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది : శివసేన రెడ్డి

కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న శివసేన రెడ్డి, మెట్టు సాయి కుమార్.

మెహిదీపట్నం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. ప్రతిభ గల వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జియాగూడ ఎంసిహెచ్ గ్రౌండ్ లో జరిగిన వీర్ చంద్రశేఖర్ ఆజాద్ బోలు సింగ్ కేసరి నాల్గవ ఓపెన్ తెలంగాణ కుస్తీ పోటీలు సోమ వారం ముగి సాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. కుస్తీ పోటీలు శారీరకంగా బలంగా ఉన్నవారే చేయగలుగుతారని, దీనికి కటోరమైన శ్రమ అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్వా నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూరాకుల కృష్ణ, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘు పాల్ రెడ్డి, టిపిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్ వినోద్ సింగ్, స్థానిక నాయకులు అబ్దుల్ అహ్మద్, గిరి, రాంకుమార్, కుస్తీ పోటీల నిర్వాహకులు ధరమ్ సింగ్ పైల్వాన్, నర్సింగ్ పైల్వాన్, సాయి పైల్వాన్, కూరాకుల రఘువీర్ పైల్వాన్ లు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల లబ్ధి కోసమే కోటి వరాల కొత్త నాటకం

-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ముషీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: రాబోయే సర్పంచ్ ఎన్నికలలో లబ్ధి పొందాలనే ఆశతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కోటి వరాలంటూ కొత్త నాటకానికి తెర తీస్తోందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా విమర్శించారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని కోరుకునే వారిలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని, కానీ గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమని విశ్వసించిన గాంధీ మహాత్ముని వారసులుగా చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వ కాలంలో గ్రామాల అభివృద్ధికై ఖర్చుచేసిన సర్పంచులకు బిల్లులు చెల్లించక, వారిని నానా యాతనకు గురి చేశారని ఆరోపించారు. సర్పంచుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు అయిందని, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సర్పంచుల బకాయిలు వెంటనే చెల్లించి, ఆ తర్వాత సర్పంచుల, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కప్ప కృష్ణా గౌడ్, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

తన భార్య కావాలనే వేధిస్తోందని డిఐ ఆరోపణ

హైదరాబాద్, (అబిడ్స్) ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: నగర పోలీసు విభాగంలో సంచలనం రేపిన అబిడ్స్ డిఐ నరసింహా వ్యవహారంలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. నరసింహా సతీమణి అదనపు కట్నం కోసం తన భర్త తనను వేధిస్తున్నాడని నేరుగా కమిషనర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై డిఐ నరసింహా మీడియాకు వివరణ ఇచ్చారు. తాను తన భార్యతో సహా ఎవరినీ వేధించలేదని, ఆమె కావాలనే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తోందని తెలిపారు. గతంలో నల్లగొండ జిల్లా ఎస్పి కార్యాలయంలో ఎస్పి సమక్షంలో కుటుంబం పరువు పోకూడదని రాజీకి వచ్చానని. అయినప్పటికీ తన భార్యలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన తెలిపారు. కొందరు వ్యక్తులతో కలిసి తన పరువును బజారుకు ఈడుస్తోందని ఆయన ఆరోపించారు. దీనిపై తాను గట్టిగా నిలదీసినందుకు తనపై కమిషనర్‌కు అదనపు కట్నం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు చేసిందని ఆయన తెలిపారు.

18న ఆర్ఎంపి, పిఎంపిల భారీ బహిరంగ సభ

సైఫాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఆర్ఎంపి, పిఎంపిలకు వెంటనే ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న 'హాలో ఆర్ఎంపి-చలో హైదరాబాద్' పేరిట ఇందిరాపార్కువద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ ఆర్ఎంపి, పిఎంపి సంఘాల ఉమ్మడి వేదిక తెలిపింది. ఈ మేరకు సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చోప్పరి శంకర్‌ముదిరాజ్, ప్రతినిధులు రమేష్, బాలబ్రహ్మచారి, మోహన్, రవి శంకర్, భాస్కర్ మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని 13, 500 మంది ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణా ఇప్పించారని చెప్పారు. కాగా తదనంతరం రాష్ట్రంలో జరిగిన పరిణామాలతో ప్రభుత్వం తమను విస్మరించిందని ఆరోపించారు. అయితే తామాంత తెలంగాణ ఉద్యమంలో పాల్గొని సాధన కోసం ఎంతో కృషి చేశామని, బిఆర్ఎస్ ప్రభుత్వం తమకు శిక్షణా ఇస్తామని చెప్పి కాలయాపన చేసిందని ఆరోపించారు. 10 సంవత్సరాల పాటు అధికారంలో కొనసాగిన బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుతం బిఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు ఆర్ఎంపి, పిఎంపిల మధ్య చిచ్చుపెట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ

సమావేశంలో మాట్లాడుతున్న చోప్పరి శంకర్

తమ డిమాండ్‌ను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిందన్నారు. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ఇతర మంత్రులను కలిసి వినతి పత్రాలను సమర్పించామని, వారంతా సానుకూలంగా స్పందించారని చెప్పారు. 18వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్రంలోని 40 వేల మంది ఆర్ఎంపిలు, పిఎంపిలు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ సభలో పాల్గొనాలని దామోదర రాజ నర్సింహ, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఎంఎల్సి ఎం.కోదండరామ్ తదితరులను ఆహ్వానించామని వారు చెప్పారు.

అరవింద్ కేజ్రీవాల్ పై చేసిన ఆరోపణలు నిరూపించండి

-మేం రాజకీయాల నుండి తప్పుకుంటాం? లేదా మీ ప్రభుత్వం రాజీనామా చేయాలి : డాక్టర్ బిడ్డి సుధాకర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ఢిల్లీ ఎన్నికల్లో సామ దాన భేద దండోపాయాలని ఉపయోగించి ఆమ్ ఆద్మీ పార్టి ని అష్ట దిగ్భందనం చేసినా రెండు కన్నా తక్కువ శాతం ఓట్లతో ఒడి పోవడం జరిగిందని, నైతిక విజయం మా పార్టి దేనని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ డి.సుధాకర్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మెదక్, జహీరాబాద్ నియోజకవర్గం నుంచి దాదాపు 15 మంది సభ్యులు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం సుధాకర్ మాట్లాడుతూ ఢిల్లీ మాజీ సిఎం రవింద్ కేజ్రీవాల్ పై చేసిన ఆరోపణలు 6 నెలల్లో ప్రూవ్ చేయండి, మేం రాజకీయాల నుండి తప్పుకుంటాం లేదా మీ ప్రభుత్వం రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. పార్టీలో చేరిన ఒక్కొక్కరు వేల మందితో సమానం అని, ముస్ముందు భారతదేశం అంతట పార్టీ విస్తరించి 2029 ఎన్నికల్లో కేజ్రీవాల్ ను ప్రధాని చేసే దిశగా పనిచేస్తామన్నారు. బిజెపి కుల, మత రాజకీయలు చేయడం మానుకోవాలన్నారు. పార్టీ నేత సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ రాజకీయంలో గెలుపు ఓటములు సహజమని కార్యకర్తలు ఎవరు నిరాశ చెందొద్దని సూచించారు.



ఎవ్రీ ఫెయిల్యూర్ ఇజ్ స్టెప్పింగ్ స్టోన్ టు సక్సెస్ అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బిజెపికి చురకలు అంటించారు. ఫెయిర్ అండ్ ట్రాన్స్పరెంట్ పాలిటిక్స్ చేసి గెలవగలరా? అని సూటిగా ప్రశ్నించారు. పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ పంతాటి రాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోర్ కమిటీ సభ్యుడు రాముగౌడ్, డాక్టర్ అన్సారీ, డాక్టర్ లక్ష్మ్యానాయుడు, జావీద్ షరీఫ్, రాజేశ్వర్, ఉమారాణి, సుందర్ జేమ్స్, నిజాముద్దీన్, సుల్తాన్, దర్శనం రమేశ్, కొడంగల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

విద్య ఎక్స్‌పో పాల్గొన్న చి

కుంభమేళా త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

కాశీ జగద్గురువు చంద్రశేఖర శివాచార్యుల ఆశీర్వాదం

చంద్రశేఖర శివాచార్య ఆశీర్వాదం తీసుకుంటున్న వీరశైవ సమాజం సభ్యులు, తదితరులు

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 10 : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళలో పాల్గొని ్రత్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించినట్లు షాద్‌నగర్ పట్టణ వీరశైవ సమాజం గౌరవ అధ్యక్షుడు అగ్గనూరు బస్వం, కిషన్‌నగర్ వేద పాఠశాల అధ్యాపకుడు సంగయ్య తెలిపారు. అదేవిధంగా కాశీ జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వాముల ఆశీర్వాదం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎన్నికల్లో చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి

రౌడీ షీటర్లకు సత్ప్రవర్తన గురించి వివరిస్తున్న ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి

పూడూరు, ఫిబ్రవరి10, ప్రభాతవార్త : వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రౌడీశీటర్లు చట్టాన్ని ఉల్లంగిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి హెచ్చరించారు. వికారాబాద్‌జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశానుసారం సోమవారం పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన రౌడీశీటర్లకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో మసలుకోవాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రౌడీశీటర్లు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో రైతు దీక్ష

కెటిఆర్‌కు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 10 : కొడంగల్‌లో నిర్వహించ తలపెట్టిన రైతుదీక్షకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కేటీఆర్‌ను ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ తదితరులు ఆయనను కలుసుకొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులను నిండా ముంచిందని అన్నారు. రైతులను నమ్మించి మోసం చేసిందని వారు తలచుకుంటే కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని పేర్కొన్నారు. అనంతరం వారు కేటీఆర్‌తో కలిసి కొడంగల్‌లో జరిగే రైతు దీక్షకు తరలివెళ్లారు. దీక్షకు వెళ్లినవారిలో మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య, పీఎసీసీఎస్ చైర్మన్ అశోక్, చిర్ర మధుసూదన్ రావు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పాత్లావత్ లక్ష్మణ్ నాయక్, గుండు సురేష్, ఉన్నారు.

బిఆర్ఎస్ పార్టీ జెండాను అవిష్కరించిన కెటిఆర్



మోనాచారి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేటీఆర్

బొంరాస్‌పేట్,ఫిబ్రవరి10,ప్రభాతవార్త : నారాయణపేట్ జిల్లా కోస్గిలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్వర్యంలో నిర్వహించే రైతు మహధర్నాకు వెళ్ళుతున్న సందర్భంగా మార్గమధ్యలో మండల పరిధిలోని తుంకిమెట్లగ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను అవిష్కరించారు. తుంకిమెట్లగ్రామానికి వస్తున్న సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపించి స్వాగతం పలుకగా అభివాదంచేస్తూ ర్యాలీగా పార్టీ జెండావద్దకు చేరుకున్నారు.

అక్కడేఉన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించారు. బిఆర్ఎస్ పార్టీ జెండా వద్దకుచెరుకొనిజెండాను అవిష్కరించారు. అయన వెంట మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, బాల్క సుమన్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. అనంతరం తుంకిమెట్ల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్‌పార్టీ నాయకులు మోనాచారి గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న అయన వారి ఇంటికి చెరుకుని కుటుంబానికి ధైర్యం చేప్పి బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, చాందుపాష, మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతయ్య, సుదర్శన్‌రెడ్డి, రవిగౌడ్, మల్లేష్‌గౌడ్, మహేందర్, రఘువేందర్‌రెడ్డి, అంజిలయ్య, వివిధ గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ ఎంపిటీసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

షాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన గడ్డం చంద్రయ్య(48) కుటుంబ సభ్యులతో గొడవపడి తాను చెరువులో పడి చనిపోతానని భార్య యాదమ్మకు శనివారం మధ్యాహ్నం చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పటినుండి కుటుంబ సభ్యులు చంద్రయ్య కోసం చెరువు పరిసర ప్రాంతాలు వెతికిన ఫలితం లేదు. దీంతో షాబాద్ పోలీస్ స్టేషన్ లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సోమవారం షాబాద్ చెరువులో నీటిపై వ్యక్తి శవం తేలుతూ ఉందని సమాచారం అందడంతో, వెళ్లి చూడగా మృతుడు గడ్డం చంద్రయ్యగా గుర్తించారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఆన్‌లైన్ కాస్మెటిక్ కోర్సులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 10 : ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన కాస్మెటిక్ కోర్సులు నేర్పించేందుకు అబీస్ ఇనిస్టిట్యూట్ ముందుకు వచ్చిందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి తెలిపారు. ఇటీవలే సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు నుండి ఇండియాకు వచ్చిన డాక్టర్ సామ రవీందరన రెడ్డి ఈ విషయాన్ని మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మొగిలిగిడ్డ, షాద్‌నగర్ ప్రభుత్వ కళాశాలలు అలదేవిధంగా షాద్‌నగర్, రాజేంద్రనగర్ డిగ్రీ కళాశాల కోసం ఎంవోయూకు ఫ్రాన్స్‌లోని యూరోపియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీతో అనుంబంధం కలిగివున్న అబిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్మెటిక్స్ సైన్స్ ముందుకు వచ్చిందని తెలిపారు. సింపూర్‌లోని సెమినార్‌లో పాల్గొనడానికి వెళ్లిన రవీందర్ రెడ్డి అభ్యర్థనమేరకు మహారాష్ట్రలోని నాసిక్ కేంద్రంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రాన్స్‌లో యూరోపియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీతో అనుంబంధం కలిగి వున్న అబిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఆన్‌లైన్ ద్వారా కోర్సులు నేర్పేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ కోర్సు ద్వారా అమ్మాయిలు స్వయం ఉపాధిని పొందుతారని, కాస్మెటిక్స్ తయారీ విధానం, వాడే విధానం, దాని ద్వారా ఉపాధి పొందే మార్గాలు తెలిపే విధంగా శిక్షణ ఇస్తారని, దానికి అనుగుణంగా సర్టిఫికెట్లు కూడా ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి డాక్టర్ సకినా పంజాబ్‌కు సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ సామ రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఒకవేళ ఒప్పందం పూర్తయితే ఈ ప్రాంతంలో అంతర్జాతీయ సంస్థల అనుబంధంతో ఎంవోయూ కలిగిన

సింగపూర్‌లో సెమినార్‌లో పాల్గొన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్ రెడ్డి

మొట్టమొదటి విద్యాలయాలు మనప్రాంతంలో నిలుస్తాయని అసిస్టెంట్ ప్రొఫెసర్‌డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సింగపూర్ సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ ప్రస్తావనసింగపూర్ అంతర్జాతీయ సమావేశాల సందర్భంగా రెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం అంశాన్నిఅసిస్టెంట్ ప్రొఫెసర్ సామరవీందర్ రెడ్డి ప్రస్తావించినట్లు మీడియాకు తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి సొంత కృషితో పెద్దఎత్తున కళాశాల భవనం అత్యాధునికంగా నిర్మించి ఇవ్వడం పట్ల వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారని, అభినందనలు తెలిపారని ఈ సందర్భంగా సామ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి అమానుషం

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 10 : చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై శ్రీరామసేన పేరిట కొందరు వ్యక్తులు దాడికి పాల్పడడం అమానుషమని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ అన్నారు. ప్రధాన అర్చకుడిపై జరిగిన దాడిని విశ్వహిందూ పరిషత్ తరఫున ఆయన తీవ్రంగా ఖండించారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అన్న సూక్తితో రాజ్యాన్ని నడిపిన శ్రీరాముడి సైన్యంగా పేరు పెట్టుకొని ఆలయంలో ప్రధాన పూజారిగా, ఆధ్యాత్మిక బోధన చేసే పూజారిని లక్ష్యంగా చేసుకొని దాడిని పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలను వీహెచ్‌పీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. ఆయనపై దాడికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పరిణామాలు ఏ ఆలయాల్లో కూడా పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆధ్యాత్మిక సేవలకు విశ్వహిందూ పరిషత్ నిరంతరం అండగా ఉంటుందని బండారి రమేష్ స్పష్టం చేశారు.

ఆసుపత్రికి వెళితే ఇల్లు చోరీ

షాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: ఆసుపత్రికి వెళితే ఇల్లు లూటీ చేసిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని సంకేపల్లి గూడ గ్రామ సమీపంలో ఉన్న కుమ్మరి చంద్రకళ, తన కోడలు, పిల్లలు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇంటికి తాళం వేసి ఈ నెల 9వ తేదీన షాద్నగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా, గుర్తు తెలియని వ్యక్తులు పడకగదిలోఉన్న బీరువాలో పెట్టిన బంగారు పుస్తెలతాడు, నాన్ చైన్, కమ్మలు, పట్టగొలుసులు, టీవీ, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

దోమ.ఫిబ్రవరి 10 ప్రభాతవార్త. ముఖ్యమంత్రి సహాయనిది నిదులు బాదితులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని దోమ మండల పరిషత్ మాజి అద్యక్షురాలు అనుసూయ అన్నారు. మండల పరిదిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్‌కు ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా మంజురు అయిన 19000 వేల చెక్కును సోమవారం నాడు బాదితుని బార్యకు అందజేశారు. ఈసందర్భముగా వారుమాట్లాడుతూ అనారోగ్యంతో బాదపడుతున్న వారంద రికిముఖ్యమంత్రి సహాయనిది పేదవారికి ఎంతోమేలు జరుగుతుందని వారికి మనోధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భముగ అబ్దుల్ ఖాదర్ చెక్కును అందించిన పర్గిఎమ్మెల్యే రాంమోహన్ ెండ్డికి దన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గోన్నారు.

అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

**మేడ్చల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త ఃఃః

ఘనంగా శివపార్వతుల కళ్యాణం



శివపార్వతుల కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

జిల్లెడు చౌదరిగూడ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారంరాత్రి స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపును నిర్వహించారు. సోమవారం స్వామివారి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. గ్రామ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని పెద్దలు స్వామివారిని వేడుకున్నారు. కళ్యాణోత్సవంలోపాల్గొన్న భక్తులు తమమొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో అందె బద్రప్ప, బాలింగం, జ్యోతిర్నింగం, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆమనగల్లు వాలీబాల్ తొలి సీజన్ సక్సెస్

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: ఆమనగల్లు వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ప్రీమియం లీగ్ తొలిసీజన్ విజయవంతమైంది. లీగ్‌లో 10జట్లు పాల్గొని ప్రతిమ్యాచ్ రసవత్తరంగా తలపడ్డాయి. ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో రెండురోజులపాటు జరిగిన వాలీబాల్ ప్రీమియర్ లీగ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో స్ట్రైకర్స్ జట్టు లోకల్ స్టార్స్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగింది. చివరికి లోకల్ స్టార్స్ జట్టుపై స్ట్రైకర్స్ జట్టు విజయం సాధించి వాలీబాల్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్ విజేతగా నిలిచి కప్పును సొంతంచేసుకుంది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన ముగింపు కార్యక్రమంలో ప్రముఖ సంఘసేవకులు పాపిశెట్టి రాము, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేష్, బిఆర్ఎస్ నేత ఎనుముల రమేష్, సీనియర్ క్రీడాకారులు మనోహర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై బహుమతులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు లండన్ జగన్(జెఎస్), పవన్‌కళ్యాణ్, ఆమనగల్లు అంబేద్కర్ యువజనసంఘం అధ్యక్షుడు వగ్గుమహేష్, ఎనుముల రమేష్, కోరే మహేందర్, ఆర్గనైజర్లు గోరటి దేవేందర్, కోరే రవి, సురేష్, చాంద్‌పాషా, గౌస్, భరత్, మల్లేష్, వెంకట్, క్రీడాకారులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.

ఎస్సై యాదయ్యకు సన్మానం

ఎస్సై యాదయ్యను సన్మానిస్తున్న ఆమనగల్లు ఎస్ఐ బి.వెంకటేశ్

ఆమనగల్లు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: ఆమనగల్లు పోలీస్‌స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి సబ్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన యాదయ్య ఆర్.జి.ఐ. అవుట్‌పోస్ట్ ప్రాంతానికి బదిలీ అయ్యారు. బదిలీపై వెళుతున్న యాదయ్యకు సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వీడ్కోలుసమావేశం నిర్వహించారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో యాదయ్య అందించిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా ఎస్ఐబి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతి మరింత బాధ్యతలను పెంపొందిస్తుందని తెలిపారు. అంతకుముందు సహోద్యోగులతో యాదయ్యకు ఘనసన్మానం లభించింది. శాలువాలు పూలమాలలతో సత్కరించి తమమధ్య ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురళీధర్‌రెడ్డి పోలీసులు మల్లేష్, ఇబ్రహీం, ప్రతాప్, జగన్, పుష్ప, శశికళ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సేవకుడి చూపు.. రాజకీయాల వైపు

-అందరి నోట.. సదర్ శ్రీనుయాదవ్

నందిగామ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: మంచి సామాజిక దృక్పథం కలిగి కుల, మత, ప్రాంతీయ భేదం లేకుండా గ్రామప్రగతికి తనవంతు చేయూతనందిస్తూ ప్రజలమన్ననలు అందుకుంటున్నారు నందిగామ గ్రామానికిచెందిన మండల సదర్ ఉత్సవకమిటీ అధ్యక్షుడు కేశమోని శ్రీనుయాదవ్. మంచి సామాజిక స్పృహ కలిగి సేవల్లో దూసుకుపోతూ జనం మెచ్చిన యువనేతగా ఎదిగిన సదర్ శీను చూపు రాజకీయాలవైపు పడిందనే ఊహగానాలు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం ఖరారు చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో సదర్ శ్రీను రాజకీయలో ఆరంగేట్రం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన రాజకీయాలవైపు అడుగులు వేస్తున్నారన్న గుసగుసలు జనంలో వినిపిస్తున్నాయి.

కీసరగుట్ట ట్రస్ట్‌బోర్డు సభ్యురాలికి సన్మానం



కీసరగుట్ట ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు అనితను సన్మానిస్తున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలిగా నియమితులైన సగ్గు అనితను సోమవారం టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సన్మానించారు. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన మాజీఎంపిటిసి సభ్యురాలు-మహిళా కాంగ్రెస్ రాష్ట్రకార్యదర్శి సగ్గు అనితహిమాకర్‌ను ప్రభుత్వం కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యురాలిగా నియమించడంతో ఆమెను వజ్రేశ్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి అనిత టిపిసిసి ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ప్రధానకార్యదర్శి బర్ల రాధా కృష్ణ, ఉపాధ్యక్షులు కోరుబొతు నాగరాజు, డిసిసికార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, మండల మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు పైళ్ల లతరెడ్డి, పోచారం మున్సిపల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్ర మాధవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నిమిత్తం స్థలాల పరిశీలన

ఆమనగల్లు, ఫిబ్రవరి10, ప్రభాతవార్త: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం కమిషనర్ శంకర్‌నాయక్ విస్తృతంగా పర్యటించారు. ఏఈతో కలిసి ఆయన ఆయా వార్డులలోని సమస్యలను గుర్తించడమే కాకుండా, కొత్తగాచేపట్టబోయే సిసిరోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణాల ఆవశ్యకతను గుర్తించేందుకు పలు వీధులను పరిశీలించారు. శ్రీకాంత్ కాలనీ, కళ్యాణిగార్డెన్స్, శివాయంనగర్‌కాలనీ, ఉదయ్ నగర్‌కాలనీ, మసీదుకాలనీ, ప్రతిభానగర్‌కాలనీతో పాటు ఇతరకాలనీల్లో వారు పర్యటించారు. ఆయా ప్రాంతాలలో ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని చెప్పారు. దశల వారీగా అన్ని వీధులలో సిసిరోడ్ల నిర్మాణం, అవసరమైన చోట అంతర్గత మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బంది షర్పు, రామకృష్ణ, పర్వతాలు, కాలనీవాసులు ఖాదర్, వెంకటేష్, రహీం. కరీం, మల్లేశ్‌నాయక్, గడియారం రాములు, మహబూబ్ అలీ, ప్లంబర్ శీను ఉన్నారు.

అభివృద్ధి పనుల నిమిత్తం స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్

పల్లె దవాఖానా వైద్యుల క్యాలండర్ ఆవిష్కరణ

క్యాలండర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డా.శోభారాణి, జిల్లా అధికారులు, జిల్లా అధ్యక్షులు డా.టి.వెంకన్న

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో పల్లె దవాఖానాల వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సోమవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో జిల్లా పల్లెదవాఖానాల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శోభారాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, జిల్లా స్టాఫ్ పాల్గొనటం జరిగింది. ఆతరువాత జిల్లా పల్లెదవాఖానాల అసోసియేషన్ నూతన కమిటీని వైద్యులు ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేషన్ కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ డి.వెంకన్న, జనరల్ సెక్రటరీగా డాక్టర్ శంకర్‌నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ టి.భవాని, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కుమార్, డాక్టర్ సాయిలను ఎన్నుకున్నారు. అదేవిధంగా దీనిలో డాక్టర్ ప్రతిభ, డాక్టర్ జయశీల, డాక్టర్ రూప పలువురు వైద్యులు పాల్గొన్నారు. క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని, అదేవిధంగ జిల్లా పల్లెదవాఖానాల అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగిందన్నారు. ఈసందర్భంగ జిల్లా పల్లెదవాఖానాల అసోసియేషన్ నూతన అధ్యక్షులు డాక్టర్ డి.వెంకన్న మాట్లాడుతూ జిల్లా కమిటీని కొత్తగా ఎన్నుకోవటం జరిగిందని దీనికి అధ్యక్షులుగా తనను ఎన్నుకున్నందుకు తోటి వైద్యులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ, వైద్యులకు అందుబాటులో ఉంటూ వృత్తిపరమైన సమస్యలుకూడ పరిష్కరించుకోవటానికి అందరి సహకారంతో కృషి చేస్తానని డాక్టర్ డి.వెంకన్న అన్నారు. ఈకార్యక్రమంలో పలువురు జిల్లా వైద్య అధికారులు, పల్లె దావాఖానాలు డాక్టర్లు, డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఇమామ్‌లకు పట్టాలు అందజేస్తున్న నేతలు

తాండూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర సిఎం సోదరుడు, కోడంగల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు వేరు వేరుగా మాట్లాడారు. సోమవారం తాండూరులో వ్యాపారి ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో సయ్యిదునాఅలీ మజీద్ ప్రారంభోత్సవ కార్యక్రమంతోపాటు 52మంది ఇమామ్‌లకు ఇళ్లపట్టాల పంపిణీకార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అథితులుగా తెలంగాణ రాష్ట్ర చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర సిఎం సోదరుడు, కోడంగల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తాండూరు ప్రాంతాన్ని కోడంగల్ తరహాలో అభివృద్ధి చేస్తామని అన్నారు. తాండూరులో పెండింగల్‌లో ఉన్నసమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. మైనార్టీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. వ్యాపారి ముజీబ్‌ఖాన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మాజీ డిపిసి సభ్యులు పట్లోళ్ల నర్సింలు, మాజీ జెడ్పిటిసి ధారాసింగ్, మైనార్టీ నాయకులు, మతపెద్దలు, వివిదసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మజీద్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మజీద్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: తాండూరు పట్టణంలో మస్జిద్‌ఈ సయ్యేదనఅలీ, ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో మజీద్ ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యతిథిగా కొడంగల్ ఇన్చార్జి తిరుపతిరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డితో పాటు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లీం మత గురువులకు ఇంటి స్థలాల పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు, ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు.

విషపురుగుల స్వైర విహారం

ఊరి మధ్యలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల దృశ్యం

నందిగామ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: మండలకేంద్రమైన నందిగామ పీర్లకొట్టంవద్ద ఏపుగాపెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని కాలనీవాసులు అధికారులకు మొరపెట్టుకున్నారు. పురాతనమైన, శిథిలమైన ఇంటిని కూల్చివేసిన ప్రదేశంలో పనికిరాని పిచ్చిమొక్కలు ఏపుగాపెరిగి విషపురుగులకు నిలయంగా మారిందని, ఎప్పుడు ఏకీడు సంభవిస్తుందోనని అనుక్షణం భయపడుతున్నట్లు విచారం వ్యక్తంచేస్తున్నారు. చుట్టుపక్కల వారు పనికిరాని వస్తువులను, పాచి పదార్థాలను పారబోయడంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా, ఈగలకు, దోమలు వృద్ధిచెందుటకు అనుకూలంగా మారిందన్నన్నారు. జనావాసాల మధ్య పిచ్చిమొక్కలను తొలగించాలని ఆయా కాలనీవాసులు మొరపెట్టుకున్నారు.

రుక్మిణి, సత్యభామ శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం

ఆలయంలో వైకుంఠోత్సవం నిర్వహిస్తున్న ధర్మకర్తలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయంలో పుణ్యాహవచనము, గీతాహవనము, కర్మ, సన్యాస, ఆత్మసంయమన, విజ్ఞాన అధ్యాయముల హవనము. లఘుపూర్వాహతి, మంటపప్రాకారసేవ, వైకుంఠోత్సవం (పరమపదోత్సవం) తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అంబారీపేట్ వంశస్థుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తుండగా మంగళవారం వేణుగోపాలస్వామిని గ్రామంలో పల్లకిపై ఊరేగించి ఉదయం 11గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో రుక్మిణీ, సత్యభామ, శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం (లగ్నము) నిర్వహించేందుకు ధర్మకర్తలు తగిన ఏర్పాట్లుచేస్తున్నారు. పలువురు దంపతులు స్వామికళ్యాణంలో పాల్గొంటున్నారని భక్తులు అధికసంఖ్యలో వచ్చి కళ్యాణం తిలకించాలని ధర్మకర్తలు కోరారు.

విశ్వకర్మ మహిళల అవగాహన సదస్సు

ఉప్పల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: శ్రీవిరాట్ విశ్వకర్మ మహిళా, యువజన పెడరేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి రామంతాపూర్, హబ్సిగూడ కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన మాట్లాడుతూ విశ్వకర్మ మహిళలకు అన్ని విధాలుగా చేయూత అందిస్తామని తెలిపారు. విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. విశ్వకర్మ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, వారికి తగు చేయూత అందిస్తామని తెలిపారు. విశ్వకర్మ మహిళాసంఘం అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలు అవంతి, కోర్ కమిటి సభ్యులు, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

పదవిలో ఉన్న వారికి సేవాభావం వుండాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: పదవి అధికారం చెలాయించేందుకు కాదని వారిలో సేవాభావం కళలు సాహిత్యంపట్ల అభిమానం వుంటే సమాజం గొప్పగా ఉంటుంది అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వసలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. భారతరాష్ట్రపతి కార్యాలయంలో అధికారిగాకన్నా తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వణాధికారిగా ఎంచుకోవటంతో ఎందరో కళాకారులకు సేవ, సహాయంచేసే భాగ్యంలభించిందని అయన సంతోషం వ్యక్తంచేశారు. శ్రీత్యాగరాయగానసభ నిర్వహణ జరుగుతున్న డాక్టర్ కెవి రమణ జన్మదినవేడుకలు సందర్భంగా గానసభ ప్రధానవేదికపై సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభ నిర్వహణలో ప్రభుత్వ పూర్వసలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు సంగీత, సాహిత్య కార్యక్రమాలలో భాగంగా మిమిక్రీ,మ్యాజిక్, మైమ్ కళాప్రదర్శనలుతో పాటు మాధవీశర్మ, అనీల శిష్యబృందం నృత్య ప్రదర్శన కన్నులపండుగగా జరిగాయి.

గానసభ అధ్యక్షుడు విఎస్.జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈసభాకార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లా డుతూ తొలి రోజుల్లో నాటకాలలో వేషాలు వేసినా జీవితంలో నాటకాలు వేయటం రాదని అన్నారు. ప్రతి వారిలో కళా రూపం వుంటుందని, దానిని వెలుగులోకి తీయాల్సిన బాధ్యత పెద్దలదేనని అన్నారు. సంగీతం నాట్యం వంటి కళలు నేర్చుకోవటానికి చాలా కాలం పడుతుంది అనీ మైమ్ మిమిక్రీ మ్యాజిక్ తక్కువ సమయంలో నేర్చుకోవచ్చు అన్నారు. అర్‌సిఎం రాజు తన గళంతో సినీ పరిశ్రమలో వెలుగుతున్నారని, అలాగే చొక్కాపు వెంకటరమణ, జెన్నీవంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గానసభ సరస్వతీ నిలయం, దైవ సన్నిధిలో వున్న భావన కలుగుతుందన్నారు. కళాజనార్ధనమూర్తి మాట్లాడుతూ రమణాచారి పుట్టినరోజున ఫిబ్రవరి నెల మొత్తం కళాకారులకు పండుగరోజు అన్నారు. అయన పదవీలోవున్న కాలంలో ఏపార్టీ పక్షం కాదని ప్రజా పక్షం అని చెప్పారు. రమణాచారి జన్మ దినం ప్రతి సంవత్సరం గాన సభ వివిధ కళాప్రక్రియలకు వేదిక కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త: వివాహానికి వెళ్తున్నానని చెప్పి వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధి మల్లుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మల్లుపల్లి గ్రామానికి చెందిన అరికెల సత్యనారాయణ వారం రోజుల క్రితం గత సోమవారం భాగ్యనగరంలో బంధువుల వివాహానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్లాడు. వారం రోజులు గడిచిన ఇంటికి తిరిగి రాకపోవడంతో బందువుల ఇంటి వద్ద గాలించిన ఆచూకీ లభించలేదు. ఫోన్ చేసిన స్పందించకపోవడంతో భార్య బుచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: సిఎం రిలిఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ అన్నారు. సోమవారం నాడు గవ్వలపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు లబ్దిదారులకు 2లక్షల రుపాయల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, నాయకులు పడాల శ్రీనివాస్, యాదవరావు తదితరులున్నారు. అలాగే మండల పరిది శాలిపేట పంచాయతీ శాలిపేట గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు.

ఆర్థిక సహాయం అందజేత

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త: మండల పరిధి గజగట్లపల్లి గ్రామానికి చెందిన లింగయ్య అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మైనంపల్లి స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు మైనంపల్లి హనుమంతరావు రూ.5వేల రుపాయలను పంపగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి అందించారు. రాఘవులు, సిద్దిరాములు, ప్రవీణ్,సతిష్, లక్ష్మణ్, శివకుమార్, వెంకటయ్య ఉన్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన తుక్కాపూర్

కొల్చారం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: కొల్చారం మండల పరిధిలోని పుక్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మహా పడిపూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తుక్కాపూర్ గ్రామ సన్నిధానం గురుస్వామి శ్రీశైలం, సన్నిధానం స్వాములు, ఇతర గ్రామల స్వాములు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, సతీష్ కుమార్, క్రిష్ణ(కిట్టు), మహేందర్‌లు అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పూజా కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన వారికి, ఆర్థిక సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ సన్నిధానం స్వాములు ధన్యవాదాలు తెలియజేశారు.

పాదయాత్రికులను అభినందించిన మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పండరీపూర్ పాదయాత్ర ఘనంగా పూర్తి చేసుకున్నవారిని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నారాయణఖేడ్ పట్టణంలో పండరీపూర్ విఠలేశ్వర స్వామి భక్తులు శ్రీకరణ్ గజేంద్ర భారతి మహారాజ్ ఆశ్రమానికి ఒక ఎకరం 20 గుంటల భూమిని కేటాయించి బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెడ్లను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. మాజీ జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్ నాయక్ మాజీ ఎమ్మెల్యేకు స్వామి చిత్రపటాన్ని బహూకరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, మల్గొండ అంజాగౌడ్, భీమన్న, ప్రశాంత్ సాగర్, శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి : సౌందర్య

అడ్డగుట్ట,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించా లని కోరుతూ సోమవారం అడ్డగుట్ట బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో జలమండలి జిఎం వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వచ్చే వేసవిలో అడ్డగుట్టలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని,అదే విధంగా పాడైన బోర్‌వెల్స్‌కు మర మ్మత్తు చేపట్టాలని,డ్రైనేజీ ఏరులై పారకుండా చర్యలు తీసుకో వాలని తుకారాంగేట్ చౌరస్తా, రియోపాయింట్, సాయి నగర్ పరిసర ప్రాంతాల్లో నూతన మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయా లని జిఎం దృష్టికి తెచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ శ్రవంతి, బిజెపి నాయకులు శివలింగం, పి.క్రిష్ణ, హంసరాజ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జోసఫ్

యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 10, ప్రభాతవార్త : ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరిగే బస్తీ ఎన్నికల్లో భాగం గా మోతీనగర్ ప్రాంతంలోని కబీనగర్‌లో సంక్షేమ సంఘం ఎన్నికల్లో ముగ్గురు పోటీచేశారు. బస్తీలో మొత్తం 351 ఓట్లు ఉండగా 347 ఓట్లు పోలయ్యాయి. నాలుగు ఓట్లు చెల్లలేదు. జోషఫ్‌కు 250 ఓట్లు పోలవగా లక్ష్మినారాయణకు 75 ఓట్లు పోలయ్యాయి మరో అభ్యర్థి నీరజ్‌కుమార్‌కు 22 ఓట్లు పోల య్యాయి. నూతన అధ్యక్షునిగా గెలుపొందిన జోషఫ్‌కు ఎన్నికల అధికారి సురేందర్‌గౌడ్, అసిస్టెంట్ అధికారి కరణ్‌లు నియామక పత్రాన్ని అందజేశారు.

ప్రతి మహిళకు శారీరక దృఢత్వం అవసరం : డా. గురవారెడ్డి

**బేగంపేట ఫ